క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ బాబూరావు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ బాబూరావు

మహారాణిపేట: కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను గురువారం రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి.. పలు అంశాలపై మాట్లాడారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఉన్నారు.

యూపీహెచ్‌సీల తనిఖీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం నగరంలోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. చిన్నవాల్తేరు, దుర్గాబజార్, తోటగరువు, కొబ్బరితోట తదితర ప్రాంతాల్లో ఉన్న యూపీహెచ్‌సీలను ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా ఎనీమియాపై ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడారు. లబ్ధిదారులను గుర్తించి వారికి మాత్రలు అందజేయాలని తెలిపారు. అన్ని యూపీహెచ్‌సీల్లోను సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, స్టాప్ డయేరియా ప్రోగ్రాంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, డీఐవో, డాక్టర్ రమారెడ్డి, డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) ఎం.నాగేశ్వరరావు, పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలి

దాబాగార్డెన్స్: నామినేటెడ్ పదవుల కేటాయింపులో వెలమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు విజ్ఞప్తి చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఏయూ వీసీగా నియమించాలని, వెలమ సామాజిక వర్గాన్ని బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏ జాబితాలోకి మార్చాలని, వెలమ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, రెడ్డి ఈశ్వరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-పలాస గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం -పలాస (07470) మెము రైలు ఈ నెల 22, 25, 27వ తేదీల్లో శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పై తేదీల్లో పలాస-విశాఖపట్నం(07471) మెము రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు

అగనంపూడి: గురుపౌర్ణమిని ఈ నెల 21న ఘనంగా నిర్వహించనున్నట్లు అగనంపూడి షిర్డీ సాయి మందిరం కమిటీ చైర్మన్ కొయ్య వెంకటరమణారెడ్డి తెలిపారు. అగనంపూడిలోని షిర్డీ సాయి మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు బాబాకు అన్నాభిషేకం, విశేష పూజల అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ధర్మాల వ్యాసశర్మ, ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మతలబు

- పూర్ణామార్కెట్ దుకాణాల ఆశీలుపై కానరాని స్పష్టత
- కమిషనర్ లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు ఉద్యోగులు



పూర్ణామార్కెట్‌లో జోరుగా వ్యాపారాలు



పూర్ణామార్కెట్

జగదాంబ: పూర్ణామార్కెట్ ఆశీలు వసూలుపై జీవీఎంసీ జోన్-4 అధికారుల తీరు కొంత మంది కింది స్థాయి ఉద్యోగులకు మూడు పువ్వులు ఆరు కాయల్లా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పూర్ణామార్కెట్ ద్వారా జీవీఎంసీకి రూ. లక్షల్లో ఆదాయం వచ్చేది. అయితే ఈ ఏడాది మార్చిలో నిర్వహించాల్సిన ఆశీలు వేలానికి ఎన్నికల సెగ తగలడంతో వాయిదా వేశారు. అప్పటి నుంచి ఆశీలు వసూలు బాధ్యతలు జీవీఎంసీ రెవెన్యూ అధికారులకు అప్పగించడంతో డిపార్టుమెంట్ పరంగా ఆశీలు వసూలు చేస్తున్నారు. ఎన్నికల తర్వాత వేలం పాటకు జీవీఎంసీ ప్రకటన చేసినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. దీనికి ఒక కారణం ఉంది. సంవత్సరం మొత్తానికి నిర్వహించాల్సిన వేలం కేవలం ఎనిమిది నెలల కాలానికి మాత్రమే నిర్వహిస్తుండడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎనిమిది నెలల కాలానికి ఏకమొత్తంగా సంవత్సర కాలానికి నిర్దేశించిన ధరావత్తు వసూలు చేస్తే తాము నష్టపోతామని కాంట్రాక్టర్లు మిన్నకుండిపోతున్నారు. అంతే కాకుండా జీవీఎంసీ వసూలు చేసినప్పుడు రూ. వేలల్లో వసూలు చేస్తూ.. కాంట్రాక్టర్ల దగ్గరకు వచ్చే సరికి రూ. లక్షలు ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా అయితే తాము నష్టపోతామని కాంట్రాక్టర్లు భావిస్తూ వేలానికి దూరంగా ఉన్నట్లు చెబుతున్నారు.

చేతులు మారుతున్న వసూలు సొమ్ము..

ఇదిలా ఉంటే జోనల్ స్థాయి అధికారి ఎన్నికల కోసమే జోన్‌లో బాధ్యతలు నిర్వర్తించడానికి రావడం, మళ్లీ నేడో రేపో వెళ్లిపోయే అవకాశం ఉండడంతో పూర్తిస్థాయిలో చర్యలు తీసులేకపోవడంతో ఆశీలు వసూలు వ్యవహారం నిర్దిష్టంగా లేదని కూడా చెబుతున్నారు. జోనల్ కార్యాలయంలో ఓ కింది స్థాయి కాంట్రాక్ట్ ఉద్యోగి, రెవెన్యూ ఆర్ఐ, గుమస్తా ఆశీలు వసూళ్లలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయిన వాళ్లకు అందలం..

వాస్తవానికి జీవీఎంసీ వేలం పాటలో కల్యాణ మండపాలు, దుకాణాలు, మార్కెట్‌లకు జెడ్సీ స్థాయి అధికారి సమక్షంలో ఓపెన్ ఆక్షన్ నిర్వహించాలి. అయితే జోన్‌లో చక్రం తిప్పుతున్న ఓ ఉద్యోగి కేవలం ఒకరిద్దరు కాంట్రాక్టర్లు వస్తే ఆక్షన్ నిర్వహించినట్లు చూపించి దుకాణాలు అప్పగిస్తున్నారని సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఆక్షన్ నిర్వహిస్తున్నట్లు వేలం పాటకు వచ్చిన కాంట్రాక్టర్లు కూడా ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి పూర్ణామార్కెట్ దుకాణాలకు ఆశీలుగా ఎంత వసూలు చేస్తున్నారో పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే మిగిలిన నెలలకు సంబంధించి వేలం పాట ధరావతు తగ్గించి నిర్వహిస్తే జీవీఎంసీకి కనీస ఆదాయం అయినా వస్తుందని అంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



జీవీఎంసీ ఆశీలు పాటకు ఇప్పటికి మూడు నాలుగు సార్లు పత్రికా ప్రకటన ఇచ్చాం. అయితే పాటకు ఒక్కరే రావడంతో వాయిదా వేశాం. డిపార్టుమెంట్ ఆశీలు వసూలు అంశం పరిశీలిస్తున్నాం. అక్రమాలు జరిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– ప్రసాదరావు, జోన్-4 జెడ్సీ, సూర్యాబాగ్

ముసురుతో ముప్పతిప్పలు

చిరు వ్యాపారులకు కష్టాలు



వ్యాపారాలు సాగక వర్షంలోనే ఉన్న చిరు వ్యాపారులు



వ్యాపారాల్లేక బండెక్కి కూర్చున్న చిరు వ్యాపారులు

దాబాగార్డెన్స్: అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండగా, ఉపరితల ఆవర్తన ప్రభావంతో కోస్తాంధ్రలో గురు, శుక్రవారాల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గత 24 గంటలుగా కురుస్తున్న జడివాన చిరు వ్యాపారులపై ప్రభావం చూపుతోంది. నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి అల్పపీడన ప్రభావం తీవ్ర నష్టం కలిగించింది. వ్యాపారాలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు అడపాదడపా కురిసిన వర్షానికి ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగలేదు. పర్యాటక ప్రాంతాలకు మణిహారంగా నిలిచిన సముద్ర తీర ప్రాంతాలు గురువారం అల్పపీడన ప్రభావంతో బోసిపోయాయి. నిత్యం పర్యాటకులు, సందర్శకులతో కళకళలాడే ఆర్కే బీచ్, గోకుల్‌పార్క్, నోవాటెల్ బీచ్ వెలవెలబోయాయి. ఎక్కడా సందర్శకులు, పర్యాటకుల జాడ లేదు. చిన్న చిన్న దుకాణాలు మూతపడ్డాయి.

చిత్తడిగా రోడ్లు..

అల్పపీడన ప్రభావం కారణంగా బుధ, గురువారాల్లో నగరంలో కురుస్తున్న చిరు జల్లులకు రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, అల్లిపురం, రెల్లివీధి, రామకృష్ణా జంక్షన్, బౌడారా రోడ్డు, 75 ఫీట్ రోడ్డు, వెలంపేట, దుర్గాలమ్మ గుడి ఏరియా, పూర్ణామార్కెట్, మెయిన్ రోడ్డు, పాత నగరం తదితర ప్రాంతాల రోడ్లన్నీ బురదతో నిండాయి. ఇదిలా ఉండగా పాఠశాలలు విడిచే సమయంలో జల్లులు పడడంతో పిల్లలు తడిసి ముద్దయ్యారు.

తీరం అల్లకల్లోలం

రుషికొండలో నిలిచిన బోటు షికారు



అల్లకల్లోలంగా మారిన తీరం

కొమ్మాది: బంగాళాఖాతంలో అల్ప పీడనం కారణంగా సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి సముద్ర తీరం గురువారం సాయంత్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో పాటు బలంగా గాలులు వీయడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. తమ విలువైన బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణంలో మార్పులతో రెండు రోజుల పాటు వేటకు విరామం చెప్పినట్లు మత్స్యకారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. రుషికొండ బీచ్‌లో బోటు షికారును నిలిపివేశారు. సముద్రంలో పెద్ద ఎత్తున అలలు ఎగసి పడటంతో బోటు షికారు నిలిపివేశామని, పర్యాటకులు గమనించాలని నిర్వాహకులు సూచించారు. బోట్లను తీరంలో భద్రపరిచారు.

ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

సీతంపేట: అధికారుల సహకారంతోనే సహజ వనరుల దోపిడీ జరుగుతోందని, ఉదాసీనత వహిస్తే వారిపై కేసులు వేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జాతీయ గనుల మంత్రిత్వ శాఖ దేశంలో ప్రముఖ జ్యూలాజికల్ హెరిటేజ్ సైట్స్ లిస్టు చేస్తూ 32 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వాలు సంరక్షించి నిర్వహణ చేయాలని 2016లో గనుల శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందులో ముఖ్యమైన ఎర్రమట్టి దిబ్బలను రక్షించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ విషయంలో పార్టీలకతీతంగా సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఈ వారసత్వ సంపద వినాశనానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఎర్ర మట్టి దిబ్బలను సర్వేచేసి బఫర్ జోన్ గుర్తించాలని తెలిపారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న విజయ్ భాస్కర్

పెందుర్తి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సమగ్ర శిక్ష రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కర్ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలకు తొమ్మిది రోజుల శిక్షణ తరగతులను పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన అబ్జర్వేషన్లను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.సువర్ణ, జిల్లా సహాయ ఎ.ఎం.వో జి.లక్ష్మి, పెందుర్తి ఎంఈవో-2 మధుమూర్తి పాల్గొన్నారు.

కుష్టురహిత జిల్లాయే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఇంటింటికీ తిరిగి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో వైద్యాధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఆశ కార్యకర్త, ఇతర సిబ్బంది డోర్ టు డోర్ సర్వేకు పూర్తి సహకారం అందించాలన్నారు. విశాఖ జిల్లాను కుష్టు రహిత జిల్లాగా మలచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, డాక్టర్ కె.సత్యవేణి, కె.వి. రమణ, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక హాల్ట్‌ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఆయా స్టేషన్లలో కల్పించిన ప్రయోగాత్మక హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. భువనేశ్వర్-సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు సత్తెనపల్లె, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగించారు. విశాఖపట్నం-మహబూబ్‌నగర్(12861) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు మధిర స్టేషన్‌లో హాల్ట్‌ను కొనసాగించారు. పూరీ-తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్‌కు, బిలాస్‌పూర్-తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్‌కు చిన్న గంజాం స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలు స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది.

కొచ్చువేలి-బరౌని మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొచ్చువేలి-బరౌని మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. కొచ్చువేలి -బరౌని (06091) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొచ్చువేలిలో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు బయల్దేరి 21న ఉదయం 11.45 గంటలకు దువ్వాడకు.. 22న మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-కొచ్చువేలి (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బరౌనిలో ఈ నెల 23వ తేదీ 11.30 గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారు 5.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటకు కొచ్చువేలి చేరుకుంటుంది.

20న ఉక్కు కేవీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈనెల 20న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. పీజీటీ విభాగంలో కామర్స్, ఎకనామిక్స్, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, సంస్కృతం, సైన్స్, సోషల్ సైన్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధృవపత్రాలతో ఆ రోజు విద్యాలయానికి హాజరు కావాలన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ ను సందర్శించి.. ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు జూలై 31వ తేదీతో గడువు ముగుస్తుందని, పూర్తి వివరాలకు ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

తప్పిపోయిన పాప నిమిషాల్లో తల్లిదండ్రుల చెంతకు..

తక్షణం స్పందించిన పోలీసులు



పోలీసుల సాయంతో తండ్రి వద్దకు చేరిన పాప

జగదాంబ: మొహర్రం ఊరేగింపుల్లో తప్పిపోయిన పాపను పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మొహర్రం సందర్భంగా వివిధ మసీదుల నుంచి ఊరేగింపుగా వచ్చిన ముస్లింలు పోలీసు కమిషనర్ కార్యాలయం పక్కన ఉన్న వైశాఖీ జల ఉద్యానవనంలో అనుపు కార్యక్రమం నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వారిలో జనసందోహం మధ్య భూపేష్‌నగర్‌కు చెందిన ఎండీ అశ్వక్, ఖుష్బూలకు చెందిన పాప తప్పిపోయింది. అయితే అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు ఆఫీసర్‌కు విషయం తెలియపరచగా వెంటనే స్పందించి 25 నిమిషాల్లో పాపను పట్టుకుని తల్లిదండ్రులు అప్పగించారు. దీంతో పాప తల్లిదండ్రులు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బకాయి జీతాలు చెల్లించాలంటూ నిరసన

దాబాగార్డెన్స్: ద్వారకా బస్టేషన్‌లో శ్రీరామ్ సాయి పార్లర్‌లో పనిచేసే 9 మంది కార్మికులకు బకాయి పడ్డ రెండు నెలల జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్ము తక్షణమే చెల్లించాలంటూ సిటు విశాఖ జిల్లా నాయకుడు వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ శ్రీరామ్ సాయి పార్లర్ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా పార్లర్‌ను అర్థంతరంగా మూసేసి హైదరాబాద్ వెళ్లిపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్టీసీ సంస్థకు పార్లర్ యాజమాన్యం సుమారు రూ.25 లక్షల డిపాజిట్ చెల్లించింది కాబట్టి ఆ డిపాజిట్ నుంచి కార్మికులకు రావల్సిన జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్ము సుమారు రూ.6 లక్షలు చెల్లించే విధంగా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆర్ఎంను యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్టీసీ ఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిటు నాయకులు వి. తులసీరాం, కుమారి, వెంకట్రావు, కార్మికులు నవీన్, మురళీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కుట్రతోనే సంక్షోభంలో ఉక్కు పరిశ్రమ

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్



సదస్సులో ప్రసంగిస్తున్న తపన్‌సేన్



హాజరైన కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం కుట్రలతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్ నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు ట్రైనింగ్ ఆడిటోరియంలో 'సంక్షోభంలో విశాఖ ఉక్కు-పరిష్కారం ఎలా' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నేటికీ కొనసాగిస్తున్నదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకుంటామన్న ప్రభుత్వం సెయిల్‌లో విలీనం చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణమే సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు . స్టీల్‌ప్లాంట్ మాజీ సీఎండీ వై.శివసాగరరావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు స్టీల్ వినియోగంపైనే ఆధారపడి ఉందన్నారు. స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా మాట్లాడుతూ పరిశ్రమ తల్లి లాంటిదని దీనిని కాపాడుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ కె.కె.రావు, మాజీ ఈడీ జి.ఎస్.ఎన్.మూర్తి, సీఐటీయూ కూటమి నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి, సన్యాసిరావు, డి.వి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసు కునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వాసుపల్లి పూజలు..

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు.

మాధవునిగా మారిన మనిషి కథే 'బ్రహ్మాసో విష్ణు' చిత్రం

దాబాగార్డెన్స్: మాధవునిగా మారిన మనిషి కథే 'బ్రహ్మాసో విష్ణు' చిత్రం అని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రమా తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల అవుతున్న ఈ హిందీ చిత్రానికి సుప్రసిద్ధ దర్శకుడు ముప్పలనేని శివ దర్శకత్వం వహించారని తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాక్షాత్తు భగవంతుని ప్రేరణతో సామాన్య మానవుడు మాధవునిగా ఎలా పరివర్తన చెందాడన్నదే బ్రహ్మాసో విష్ణు సినిమా కథాంశం అన్నారు. ప్రజాపిత బ్రహ్మ బాబా దివ్య జీవిత చరిత్ర, బ్రహ్మకుమారీ, కుమారుల పవిత్ర వైవిధ్య జీవన శైలిని ఈ సినిమా ప్రతిబింబిస్తుందన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో గాజువాక లక్ష్మీకాంత్, మధురవాడ కృష్ణా మినీ ప్లెక్స్ థియేటర్లలో ఉదయం 9.30 గంటలకు ఈ సినిమా ప్రదర్శన ఉంటుందన్నారు. సినీ నటుడు ప్రసన్న కుమార్, సింహాచలం దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు, ప్రముఖ కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ధనుంజయ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ విశాఖపట్నం ఎడిషనల్ ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ. 49/2020, ఓ.పి. 1177/2019

బిట్వీన్

గుమ్మూడి ఆనందకుమారి ... పిటీషనర్

మరియు

నెర్ల ప్రసన్న లక్ష్మి మరియు ఇద్దరు ... రెస్పాండెంట్లు

టు 2వ రెస్పాండెంటు

vinila Styling herself as
W/o G.Jaya Prakash, Lecturer,
Department of Commerce,
Savitramma Govt. Womens Degree College,
Greeamspet, Chittoor.
Presently residing at Chaitanya Nagar, Gajuwaka.

యిందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై పిటిషన్‌లో పిటిషనర్‌ను పైన ఎఫ్.సి. ఓ.పి. 1177/2019 రులో 3వ రెస్పాండెంట్‌గా చేర్పించకోరి పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ **తే. 12-08-2024 దీని వాయిదా అయివున్నది.** అందు విషయమై మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల, పై కోర్టులో పై తేదీని స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేసుకోవల్సిందిగా కోరడమైనది.

విశాఖపట్నం — వై.వెంకటరావు, అడ్వకేట్
తే. 10-07-2024దీని — సెల్: 9440122487